పల్లెల్లో పారిశుధ్య లోపం
- 'ప్రత్యేక పాలన'లో గ్రామీణుల అవస్థలు - 8లో..

కొనసాగుతున్న బడిబాట - 8లో..



ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- 41,761 మంది రైతుల నుంచి సేకరణ
- మొత్తం విలువ రూ.576 కోట్లు
- రూ.532.06 కోట్ల చెల్లింపు
- మరో రూ.43.99 కోట్లు పెండింగ్
- తగ్గిన పౌరసరఫరాల అంచనా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఎట్టకేలకు ముగిశాయి. ప్రకృతి వైపరీత్యాలు, కొనుగోళ్లలో జాప్యం వంటి సమస్యలను అధిగమించి ధాన్యం సేకరణ పూర్తి చేశారు. 41,761 మంది రైతుల నుంచి రూ.576.05 కోట్ల విలువైన ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేసింది. యాసంగిలో పౌరసరఫరాల శాఖ కొనుగోలు లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. జిల్లాలో యాసంగిలో 1.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1.73 లక్షల ఎకరాల్లో వరి వేశారు. వరి సాగుకు అనుగుణంగా దిగుబడిపై పౌరసరఫరాల శాఖ కొనుగోలుకు కార్యాచరణ రూపొందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 1.73 లక్షల ఎకరాల ద్వారా 3.81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. 81 వేల మెట్రిక్ టన్నులు మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తారని భావించారు. వడగళ్ల వర్షాలు, సాగునీరు కొరత వంటి సమస్యలు దిగుబడిపై ప్రభావం చూపినట్లు భావిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకో లేకపోయింది.



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

● రూ.532.06 కోట్లు చెల్లింపు

జిల్లాలో యాసంగిలో రూ.576.05 కోట్ల విలువైన ధాన్యాన్ని 41,761 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటి వరకు రూ.532.06 కోట్లు చెల్లించారు. ఐకేపీ ద్వారా కొనుగోలు చేసిన 8757 మంది రైతులకు రూ.101.65 కోట్లు చెల్లించగా సింగిల్ విండోల ద్వారా 30,899 మంది రైతులకు రూ.411.30 కోట్లు, డీసీఎంఎస్ ద్వారా 1001 మంది రైతులకు రూ.12.40 కోట్లు, మెప్మా ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన 473 మంది రైతులకు రూ.671 కోట్లు ధాన్యం డబ్బులను చెల్లించారు. ప్రస్తుతం రూ.43.99 కోట్లు రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది.

● 2.61 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా 259 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీ ద్వారా 44 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 202, డీసీఎంఎస్ ద్వారా 9 కేంద్రాలు, మెప్మా ద్వారా 4 కేంద్రాలు ప్రారంభించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా 41,761 మంది రైతుల నుంచి 2 లక్షల 61 వేల 485 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఐకేపీ ద్వారా 9126 మంది రైతుల నుంచి 47,101.980 మెట్రిక్ టన్నులు, సింగిల్ విండోల ద్వారా 31,067 మంది రైతుల నుంచి 205208.560 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ద్వారా 1095 మంది రైతుల నుంచి 6127.760 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 473 మంది రైతుల నుంచి 3047.680 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోళ్లలో గ్రేడ్ ఏ రకం 261264.80 మెట్రిక్ టన్నులు, కామన్ రకం 221.800 మెట్రిక్ టన్నులను సేకరించారు. కొనుగోళ్ల సమయంలో రైతులు తరుగు, తేమ, హమాలీల పేరిట కోతలు విధించడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

వాహనదారులు పన్నులు చెల్లించాలి

సిరిసిల్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు తమ వాహనాల పన్నులు చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే వాహనం పన్నుపై మొదటి నెల 50 శాతం, రెండో నెల వంద శాతం, మూడో నెల 200 శాతం అదనంగా వసూలు చేస్తామని తెలిపారు. సకాలంలో స్పందించాలని పేర్కొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

సిరిసిల్ల క్రైం, జూన్ 7:జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 5 వరకు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత తెలిపారు. సిరిసిల్లలోని జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ కోర్టు, జూనియర్ సివిల్ కోర్టుల్లో మూడు బెంచ్‌ల ద్వారా లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 7 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రాష్ట్ర అగ్నిమాపక శాఖ నుంచి ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్‌లను తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని మొత్తం 144 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయని, అగ్నిమాపక వెబ్ సైట్‌లో ఆస్పత్రుల వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం సర్టిఫికెట్ పొందాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉజ్వల భవిష్యత్

సిరిసిల్ల రూరల్ జూన్7: విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని డీఈవో రమేష్ కుమార్ కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకంపేట ఆధ్వర్యంలో తారకరామానగర్, గణేష్ నగర్, సుందరయ్య నగర్. వెంకంపేట, పద్మనగర్, బీవైనగర్ ప్రాంతాల్లో శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజన వసతితోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎంఈవో దూస రఘుపతి, సెక్టోరియాల్ అధికారి సతీష్, స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు, కమలాకర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్, పద్మ, భారతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి, జూన్ 7: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ఫైన్ ఆర్ట్స్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి బీఏ హానర్స్, ఫ్యాషన్ డిజైన్, బీఏ హానర్స్, ఇంటీరియర్ డిజైన్, బీఏ హానర్స్ ఫొటోగ్రఫీ కోర్సుల్లో ఉమ్మడి జిల్లా గిరిజన, గిరిజనేతర విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌లతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 13లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై

తంగళ్లపల్లి, జూన్7: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మండేపల్లి చౌరస్తాలో మెగా జాబ్ మేళా పోస్టర్లను ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ అఖిల్ మహజన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సిరిసిల్లలోని కల్యాణ లక్ష్మీ గార్డెన్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎస్సై చంద్రమౌళి పాల్గొన్నారు.

వినియోగంలోకి కంపోస్ట్ షెడ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



చెత్తను వేరు చేస్తున్న పంచాయతీ కార్మికుడు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువు సమీపంలో నిర్మించిన కంపోస్ట్ షెడ్డులో తడి, పొడి చెత్తను వేరు చేయకుండానే డంపింగ్ యార్డుకు తరలించి కాల్చి వేశారు. దీంతో కంపోస్ట్ షెడ్ నిరుపయోగంగా మారింది. ఈ విషయమై ఈ నెల 5న 'నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి దేవరాజు స్పందించారు. ప్రజల వద్ద నుంచి ట్రాక్టర్ల ద్వారా సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు షెడ్డులో సేంద్రియ ఎరువు తయారీకి శుక్రవారం చర్యలు చేపట్టారు. కంపోస్టు షెడ్ వినియోగంలోకి రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్-1 పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలి

- కంట్రోల్ రూం నంబరు 9398684240 ఏర్పాటు
- కలెక్టర్ అనురాగ్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అధికారులందరూ సమన్వయంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షపై అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగే గ్రూప్-1 పరీక్షకు జిల్లాలో 4699 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ మొబైల్ ఫోన్‌లు తీసుకెళ్లవద్దన్నారు. ప్రతీ కేంద్రంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. జిరాక్స్ సెంటర్‌లు మూసి ఉంచాలని, ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా చూడాలని, సెస్ అధికారులను పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అవసరమైన మందులతో ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను సూచించారు. మంచినీరు, టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన సమస్యలు ఉంటే జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 9398684240 సెల్ నంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఆర్‌సీవో వడ్లూరి శ్రీనివాస్, డీఆర్‌డీవో శేషాద్రి, డీపీవో వీరబుచ్చయ్య, డీటీవో లక్ష్మణ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, పీఆర్ ఈఈ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో బడిబాట నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 7 : ప్రతీ బాలిక పాఠశాలలో అడ్మిషన్ పొందేలా చూడాలని, ప్రత్యేక శ్రద్ధతో బడిబాట కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బడిబాటనిర్వహణపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల నమోదు శాతం పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికల డ్రాప్ ఔట్ కాకుండా చూడాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం బడిబాటలో భాగస్వాములుకావాలన్నారు. బాలికలు విద్యం దూరం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. బాలికలు పదో తరగతి ముగిసిన తర్వాత ఇంటర్ చదివేలా తల్లిదండ్రులకు వివరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా శారీరక లోపంతో ఉన్న చిన్నారుల వివరాలు సేకరించాలని, వారికి సైతం విద్యను అందించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. దివ్యాంగుల చిన్నారుల జాబితాను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో వార్డు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. బాల కార్మికులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, హోటళ్లు, ఇటుకబట్టీలను తనిఖీ చేయాలని, బాల కార్మికులు కనిపిసేత్త వెంటనే పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. వలస కూలీల పిల్లలను సైతం పాఠశాలలో చేర్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ కూలీల కింద నమోదై జాబ్ కార్డులు కలిగిన ప్రతీ కుటుంబంలో పిల్లలు చదువుకుంటున్నారా? లేదా? పరిశీలించాలన్నారు. చదువుకోని పిల్లలు ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం డీఈవో రమేష్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట నిర్వహించాలని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, జడ్పీ సీఈవో ఉమరాణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సమన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 7: పంటల సీజన్‌లో వ్యవసాయ శాఖ అధికా రులు రైతులకు అందుబాటులో ఉండాలని, పంటల సాగులో మెళకవలను అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో పంటల సాగు, విత్తనాలు, ఎరువులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన తరువాత రైతులు రసీదులు తీసుకోవాలన్నారు. లూజ్ విత్తనాలు తీసుకోవద్దని, గుర్తింపు లేని వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని అన్నారు. వ్యవసాయ శాఖ గుర్తింపు ఉన్న పత్తివిత్తనాలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు తమ పరిధిలోని దుకాణాల్లో నిత్యం తనిఖీలు చేయాలని, స్టాక్ రిజిస్టర్, నిల్వలను సరి చూసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వ్యవసాయశాఖ అధికారులు

నవగ్రహాల చుట్టూ శునకం ప్రదక్షిణలు



ప్రదక్షిణలు చేస్తున్న శునకం

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: ఏదైనా ఆపద వస్తే ఆలయానికి వెళ్లి భక్తితో దేవుడిని కొలుస్తాం. మంచి జరగాలని వేడుకుంటాం. కొంతమంది శని తొలగిపోవాలని నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. కానీ ఓ శునకం నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని గీతామందిరంలోని నవగ్రహాల చుట్టూ కుక్క పిల్ల ప్రదక్షిణలు చేస్తున్న వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గురువారం శని జయంతి సందర్భంగా భక్తులు గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడే ఉన్న ఓ కుక్క పిల్ల ఒంటరిగా నవగ్రహాల చుట్టూ తిరగడాన్ని చూసి కొందరు సెల్‌ఫోన్లతో వీడియో తీశారు. లెక్క పెట్టినట్లు 11 సార్లు నవగ్రహాల చుట్టూ తిరిగి అక్కడి నుంచి వెళ్లిపోవడంపై చూసి అక్కడున్న వారు ఆశ్చర్యపోయారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ ఆడతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 7 : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా జర్నలిస్టులు ఆడిన మ్యాచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కబడ్డీ, కోకో వాలీబాల్ వంటి క్రీడలను ఆడేవాళ్లమన్నారు. నేడు ఆధునిక ప్రపంచంలో క్రికెట్‌ను విశ్వవ్యాప్తంగా ఆదరిస్తున్నారన్నారు. క్రీడలతో సమస్యలను అధిగమించే ఒక శక్తి ఏర్పడుతుందని, క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జర్నలిస్టులు తదితరులు ఉన్నారు.

అర్బన్ బ్యాంక్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక



చైర్మన్‌ను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

- చైర్మన్‌గా రాపెల్లి లక్ష్మీనారాయణ
- వైస్ చైర్మన్‌గా అడ్డగట్ల మురళి
- బీఆర్ఎస్ శ్రేణుల సందడి

సిరిసిల్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల తుది ఘట్టం ముగిసింది. బ్యాంక్ చైర్మన్‌గా రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా అడ్డగట్ల మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 12 డివిజన్లలో పోటాపోటీగా సాగిన ఎన్నికల్లో గెలుపొందిన డైరెక్టర్లు శుక్రవారం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్యాంక్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు మెజార్టీగా గెలుపొందడం స్వతంత్రులుగా గెలిచిన మరో ఇద్దరు కూడా బీఆర్ఎస్‌కు మద్దతు తెలపడంతో మూడోసారి బ్యాంక్ పాలకవర్గం పగ్గాలను బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్లే కైవసం చేసుకున్నారు. ఎన్నికల అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. రాపెల్లి లక్ష్మీనారాయణ చైర్మన్‌గా నామినేషన్ దాఖలు చేశారు. బుర్ర రాజు ప్రతిపాదించగా గుడ్ల సత్యానందం బలపరిచారు. అడ్డగట్ల మురళి వైస్ చైర్మన్‌కు నామినేషన్ దాఖలు చేయగా కోడం సంజీవ్ ప్రతిపాదించగా ఎనగందుల శంకర్ బలపరిచారు. పోటీకి నామినేషన్లు రాకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం చైర్మన్ బాధ్యతలను స్వీకరించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లతోపాటు డైరెక్టర్లను జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్లు గాజుల నారాయణ, దార్నం లక్ష్మీనారాయణతోపాటు బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, మున్సిపల్ కౌన్సిలర్లు సన్మానించారు.



లక్ష్మీనారాయణ చైర్మన్



మురళి వైస్ చైర్మన్

విజయోత్సవ ర్యాలీ

బీఆర్ఎస్ మద్దతుదారులు విజయం సాధించడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి. బ్యాంక్ ప్రధాన కార్యాలయం నుంచి గాంధీచౌక్, చేనేత చౌక్ వరకు ర్యాలీ చేపట్టాయి. పట్టణంలోని కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.

డైరెక్టర్ల నిరసన

అర్బన్ బ్యాంక్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందిన డైరెక్టర్ చొప్పదండి ప్రమోద్, బీజేపీ మద్దతుతో గెలుపొందిన పత్తిపాక సురేష్ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నిక సమావేశాన్ని బహిష్కరించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక డబ్బులతో ముడిపెట్టి సాగిందని ఆరోపించారు.



వైస్ చైర్మన్‌ను అభినందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ సునీత

హుజూరాబాద్‌రూరల్, జూన్ 7: హుజూరాబాద్ ప్రాంతంలో నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకుంటామని ఏడీఏ సునీత అన్నారు. అనుమతులు ఒక్క చోట తీసుకొని విత్తనాలను మరో చోట విక్రయిస్తున్న కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు, వ్యవసాయాధికారులు తెలిపారు. మేడ్చల్ జిల్లాకు చెందిన శాంభవి ఆగ్రి సీడ్స్ ప్రతినిధి రాచపల్లి లింగయ్య మండలంలోని శాలపల్లి -ఇందిరానగర్ గ్రామంలోని రైతులకు 20 కిలోల విత్తనాల బ్యాగుల చొప్పున 141 బస్తాలు సుమారు 60 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు వ్యవసాయ శాఖ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనుమతి ఒక చోట ఉంటే విత్తనాల విక్రయాలు మరోచోట జరిపినందుకు గాను సదరు కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

10 నుంచి టీజీ పీఈసెట్

గణేశ్‌నగర్, జూన్ 7: తెలంగాణా ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024 (టీజీ పీఈసెట్)ను ఈ సంవత్సరం కూడా శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ తెలిపారు. 2400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరికి జూన్10 నుంచి 13వరకు శాతవాహన విశ్వ విద్యాలయం లోని క్రీడా మైదానంలో శరీర దారుఢ్య సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహించమన్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6:30 నుంచి బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పురుష అభ్యర్థులకు ఈనెల 10,11వ తేదీల్లో, మహిళా అభ్యర్థులకు 12,13వ తేదీల్లో శారీరక సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే దూర ప్రాంత విద్యార్థులకు యూనివర్సిటీలో వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఎస్‌యూ బీఎస్సీ హానర్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్ 7: శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ రెండవ సెమిస్టర్‌కు సంబంధించిన తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 26 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

రేషన్ సరుకుల కోసం
ఇబ్బందులు

- కిలోమీటర్ల దూరం వెళ్తున్న ప్రజలు

- తుర్తిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వేడుకోలు


తుర్తి గ్రామం

కథలాపూర్, జూన్ 7: రేషన్ సరుకులు మా పల్లెలోనే పంపిణీ చేయండి మహాప్రభో అని మొరపెట్టుకుంటే... లేదండీ మీకు నిబంధనలు వర్తించవు అనే అధికారుల సమాధానాలతో ఆ పల్లె జనం ఎదుర్కొంటున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల తరబడి రేషన్ దుకాణాలు లేక కిలోమీటర్ల కొద్దీ దూరం నడిచి సరుకులు తెచ్చుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ ఇబ్బందులను పట్టించుకునే నాథుడే లేడని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● హామీలు నెరవేర్చని నేతలు

మూడు మండలాల సరిహద్దుల్లో ఉన్న తుర్తి గ్రామంలో నేటికీ రేషన్ దుకాణం ఏర్పాటు చేయని కారణంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబారిపేటకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఇక్కడికి కేటాయించిన సరుకులను అంబారిపేటకు చెందిన డీలర్‌తో పంపిణీ చేస్తున్నారు. అధునాతన పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా సరుకులు పంపిణీ చేస్తుండగా ఈ పల్లెలో టెలికాం నెట్‌వర్క్ సమస్య కారణంగా విధిలేని పరిస్థితుల్లో వినియోగదారులు అంబారి పేటకు వెళ్లాల్సి వస్తోంది. అదేవిధంగా అంబారిపేట పరిధిలో ఉన్న గిరిజనులు రెండు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి సరుకులు తీసుకెళ్తున్నారు. వానాకాలంలో వినియోగదారులకు విపరీతమైన ఇక్కట్లు తప్పడం లేదు. ఆరు సంవత్సరాల కిందట చింతకుంటకు అనుబంధంగా ఉన్న రాజారాం తండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడ కూడా నేటికీ రేషన్ దుకాణం మంజూరు చేయలేదు. దీంతో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతకుంటకు విధిలేక సరుకుల కోసం వెళ్లక తప్పడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 రేషన్ కార్డులు ఉంటేనే రేషన్ దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందనే నిబంధనలు ఆ పల్లెవాసులకు గుదిబండగా మారిందనే ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదు

గ్రామపంచాయతీ ఏర్పడ్డ నాటి నుంచి రేషన్ దుకాణం మంజూరు చేయాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. గిరిజనులు సరుకుల కోసం పడుతున్న అవస్థలను వివరించి చెప్పినా వినిపించుకోలేదు. మారుమూల అటవీ ప్రాంతాల ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడం దారుణం.

- లావుడ్య రవీందర్, రాజారాం తండా

దుకాణాలు ఏర్పాటు చేయాలి



ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని దుకాణాలు ఏర్పాటు చేయాలి. మండల పరిషత్ సమావేశాల్లో పలు మార్లు ఈ సమస్యను ప్రస్తావించి అధికారుల దృష్టికి తెచ్చిన సందర్భాలున్నాయి. జనాభా, కార్డులతో సంబంధం లేకుండా గ్రామపంచా యతీకి రేషన్ దుకాణం విధిగా మంజూరు చేస్తూ కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

- కొలకాని శేఖర్, మాజీ సర్పంచ్ తుర్తి

అటవీ భూముల ఆక్రమణ .. ఒకరిపై కేసు నమోదు


అటవీ ప్రాంతంలో నరికిన చెట్లు

కోనరావుపేట, జూన్ 7: అటవీ భూములను ఆక్రమించేందుకు టేకు చెట్లతో సహా అన్నిటినీ నరికి వేస్తున్నారు. రెండు రోజుల క్రితం అధికారులు ఒకరిపై కేసు నమోదు చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. కోనరావుపేట అటవీ ప్రాంతంలోని ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ టెంపుల్ ఆవరణలోని అటవీ ప్రాంతంలో ఏకంగా మిషన్ల ద్వారా చెట్లను నరికి వేస్తున్నారు. అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారం రోజులుగా మిషన్‌లతో చెట్లను నరికి వేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. చక్రాల వేణు అనే వ్యక్తిపై ఇప్పటికే అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. అయినప్పటికీ చెట్లను నరికి వేస్తూ అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. చెట్లను నరికి వేస్తూ అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోనరావుపేట మండల వాసులు కోరుతున్నారు. అటవీ భూముల ఆక్రమణపై ఎఫ్‌ఎస్‌వో శ్రీనివాస్‌ను వివరణ కోరగా చెట్లను నరికి వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే చక్రాల వేణుపై కేసు నమోదు చేశామన్నారు. మిషన్‌లతో చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెండు గ్రామాల మత్స్యకారుల మధ్య
చేపల చెరువు వివాదం

చందుర్తి, జూన్ 7 : చేపల కోసం రెండు గ్రామాల మధ్య పంచాయతీ ఏర్పడింది. చందుర్తి మండలంలోని కట్టలింగంపేట, లింగంపేట గ్రామాల శివారులో గురునాథం చెరువు ఉంది. గతంలో కట్టలింగంపేటకు చెందిన గంగపుత్ర సంఘం మత్స్యకార్మికులు సొసైటీ ఏర్పాటు చేసుకొని మత్స్యకారులు కలిసి చేపలు పట్టుకునే వారు. వాటా(పాలు) పంచుకునేవారు. శుక్రవారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో కట్టలింగంపేటకు చెందిన మత్స్యకారులు గురునాథం చెరువులో చేపలు పట్టుకొని వచ్చారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు వెళ్లడంతో విషయం తెలుసుకున్న కట్టలింగంపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువు వద్దకు వెళ్లి తమ చెరువులో చేపలు పట్టవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులు చెరువు మాదంటే, మాదే అనడంతో వివాదం తలెత్తింది. ఏడాది క్రితం కూడా వివాదం తలెత్తింది. గతంలో చెరువు సొసైటీ ఏర్పాటు చేసుకొని ఎవరైతే పట్టుకున్నారో వారే పట్టుకోవడానికి హక్కులు ఉంటాయని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు చెరువులో తమ పట్టా భూములు ఉన్నాయని చెప్పడంతో, సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇస్రో ఆన్‌లైన్ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక


షరీఫ్ అహ్మద్

చిగురుమామిడి, జూన్ 7: మండలంలోని రామంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ శిక్షణకు ఎంపికయ్యా రని ప్రధానోపాధ్యా యుడు ఎస్ దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో నిర్వ హించే శిక్షణ కార్యక్రమానికి షరీఫ్ అహ్మద్ ఎంపిక కావడం సంతోకరమని పేర్కొన్నారు. దీని ద్వారా జాతీయ స్థాయిలో పాఠ శాలకు గుర్తింపు రావడం సంతోషకరమని తెలిపారు.

గత ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ నష్టం

- ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే మూడు బ్యారేజీల మరమ్మతులు
- పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి
- బ్యారేజీల నష్టంపై జ్యుడీషియల్ కమిటీ విచారణ
- తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని తప్పకుండా నిర్మిస్తాం
- రాష్ట్ర నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంథని/మంథనిరూరల్, జూన్ 7: గత ప్రభుత్వంలో పెద్దల నిర్లక్ష్యం తోనే కాళేశ్వరం ప్రాజెక్టు భారీ నష్టం జరిగిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంథని మండలంలోని సుందిళ్ళ బ్యారేజీలో కొనసాగుతున్న మరమ్మతు పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ళ, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలను ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన బ్యారేజీల్లో కొనసాగుతున్న రిపేర్ పనుల్లో ప్రతి పనికి నిర్దిష్ట సమయం నిర్దేశించుకుని వేగవంతంగా పూర్తి చేయాలి అధికారులకు సూచించారు. సుందిళ్ళ బ్యారేజీ వల్ల స్థానికంగా వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మతు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తికావాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి పనికి సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తిచేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, దేశంలోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీలకు బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జీ చంద్రఘోష్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుం దన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సుందిళ్ల(పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజీ సంరక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ, ఎస్ఈఏం. కరుణాకర్, ఈఈ సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటి పారుదల అధికారులు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చంద్రఘోష్‌ను కలిసిన అదనపు కలెక్టర్

జ్యోతినగర్, జూన్ 7: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విచారణ కమిషన్ చైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పి చంద్రఘోష్‌ను శుక్రవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని వీజీపీ గెస్ట్‌హౌస్(జ్యోతిభవన్)లో అ దనపు కలెక్టర్ జె అరుణశ్రీ కలిశారు. విచారణలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించిన తరువాత ఎన్టీపీసీకి వచ్చిన కమిషన్ చైర్మన్‌కు అదనపు కలెక్టర్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.


చంద్రఘోష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్

హత్యా..ఆత్మహత్యా?

- అనుమానాస్పదంగా మృతి చెందిన జూనియర్ అసిస్టెంట్ - శరీరంపై గాయాలు
- సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు - జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో విషాదం


రమేశ్(ఫైల్)


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 7: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. కాలనీలో నివాసముంటూ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన పంగ రమేశ్(50) అనే వ్యక్తి పట్టణంలోని రాంనగర్‌కాలనీ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. గతంలో వీఆర్ఏ, వీఆర్‌వోగా పనిచేసిన ఆయన వీఆర్‌వో వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుతం భూపాలపల్లి మునిసిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య రేణుక పిల్లలను తీసుకొని రెండు రోజుల కిందటే కరీంనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లగా రమేశ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీసి ఉండటం, కోతులు ఇంట్లోకి చొరబడి చిందరవందర చేశాయి. దీంతో గమనించిన ఇంటి పక్కనున్న వారు కోతులను కొట్టేందుకు ఇంట్లో వెళ్లి చూడగా రమేశ్ విగత జీవిగా బాత్ రూమ్‌లో పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి ఇన్‌చార్జ్ సీఐగా ఉన్న చిట్యాల సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై ప్రసాద్ లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారి ని ఆరా తీశారు. కాగా, మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయి.

● అదుపులో ఇద్దరు వ్యక్తులు..?

ఈ ఘటన వివరాలు తెలియగానే సకాలంలో చేరుకున్న పోలీసులు రమేష్ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. విచారణను వేగవంతం చేసి మృతుడి ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి అందులోని హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యుల్లోని ఓ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. కుటుంబ అవసరాలకు పంగ రమేశ్ వారి బంధువుల వద్ద తీసుకున్న డబ్బుల విషయంలోనే గొడవలు జరిగి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే చర్చ జరుగుతోంది. కాగా, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తుండటం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

విచారణ తదుపరి వివరాలు వెల్లడిస్తాం..

- మల్లేష్‌యాదవ్, భూపాలపల్లి ఇన్‌చార్జి సీఐ

భూపాలపల్లి రాంనగర్‌లో జరిగిన ఘటనపై మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో విచారణ చేసిన పిదప వివరాలు వెల్లడిస్తాం. శరీరంపై గాయాలు ఉండటం మూలంగా హత్య చేసినట్లుగానే అనుమానిస్తున్నాం. త్వరలోనే నిజాలు తేల్చి హత్యా.. ఆత్మహత్యా.. సాధారణ మరణమనేది చెబుతాం.

అగ్ని పర్వతంపై కరీంనగర్ మహిళ


పర్వీన్ సుల్తాన

కరీంనగర్ అర్బన్, జూన్ 7: అగ్ని పర్వతంపై మొదటిసారిగా భారతదేశానికి చెందిన ఇద్దరు మహిళలు అడుగుపెట్టి చరిత్ర సృష్టించారు. ఆ ఇద్దరిలో ఒకరు మహమ్మద్ పర్వీన్ సుల్తానా కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందినవారు. ఆసియా ఖండంలో ఏకైక అగ్ని పర్వతం అండమాన్ నికోబార్ దీవులలో బెరన్ ఐలాండ్‌లో ఉంది. ఆ అగ్ని పర్వతంపై మొదటిసారిగా ఇద్దరు మహిళలు అడుగుపెట్టారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సెస్, డెహ్రాడూన్, ఇస్రో వారి ప్రత్యేక పరిశోధన ప్రాజెక్టులో భాగంగా డాక్టర్ మమతా చౌహాన్ సారథ్యంలో పరిశోధకుల బృందం అగ్ని పర్వతవం వద్దకు వెళ్లారు. ఆ బృందంలో ఒక రు రీంనగర్ కోతిరాం పూర్‌కు చెందిన మహమ్మద్ పర్వీన్ సుల్తానా. మే 29న బెరెన్ ఐలాండ్‌లోని అగ్ని పర్వతంపై ఆమె అడుగు పెట్టారు. ఈ పరిశోధనలో భాగంగా అగ్ని పర్వతం భౌగోళిక పరిణామాలు, శాస్త్రీయ విశ్లేషణ, అగ్ని పర్వత పనితీరు, ప్రకృతి విపత్కర పరిస్థితులపై అంచనా కోసం అక్కడ నుంచి వివిధ రకాల నమూనాలను సేకరించారు. అండమాన్ ఐలాండ్‌లోని డిగ్లీపూర్ నుంచి రంగౌత్ వరకు సుమారు వంద కిలోమీటర్లకు పైగా వివిధ ప్రాంతాలలో నమూనాలను సేకరించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మల్యాల, జూన్ 7: జగిత్యాలకు చెందిన ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్య యత్నం చేసుకుంది. రజిత అనే ఆశవర్కర్ శుక్రవారం ఉదయం మల్యాల మండలం నూకపల్లి శివారులో గల బావిలో దూకగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది సంపత్ తదితరులు అక్కడకు చేరుకొని స్థానికులతో కలసి ఆమెను బావిలో నుంచి తీశారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు రజితను ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రమాదం ఏమీ లేదని తెలిసింది. ఆత్మహత్యయత్నంకు కారణాలు తెలియలేదు. ఫిర్యాదు రాలేవదని ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

రైతుకు తీవ్ర గాయాలు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన దాసరి గోపాల్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో ట్రాక్టర్ రోడ్డువేటర్‌తో భూమి చదును చేయిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు వేటర్ మధ్య కాలు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తన వ్యవసాయ భూమిలో రోడ్డు వేటర్‌తో భూమి దున్నుతుంటే గోపాల్ వెనుక నుంచి ట్రాక్టర్ ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారాడు. కాలు రోడ్డు వేటర్లో పడడంతో తెగిపోయింది. గోపాల్‌ను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి, జూన్ 7 : చందుర్తి మండలం లింగంపేటలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. లింగంపేట గ్రామంలో బోజ సుభాష్ అక్రమంగా రేషన్ బియ్యం ఓ ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఇంట్లోని ఓ గదిలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేసి ఉండగా సీజ్ చేశారు. ఈ ఘటనలో సుభాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలించడం నేరమని తెలిపారు.

డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్ 7: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశా లల్లో రెండు సంవత్సరాల కోర్సులైనా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) మొదటి సంవత్సరము 2004-25లో చేరేందుకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైందని ఎల్ఎండీ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. షెడ్యూల్ తెగల, షెడ్యూల్ కులాలు, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు 1,2024 నాటికి 17 సంవత్సరాల వయస్సు ఉండాలని గరిష్ఠ వయో పరిమితి లేదని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జూలై 10వ తేదీన ఉంటుందని తెలిపారు. డీఈఎల్ ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందని పేర్కొన్నారు. డీపీఎస్ఈ మాత్రము కేవలం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని తెలిపారు. వివరాలకు డీఈఈసెట్-2024 వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు.

ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

మానకొండూర్, జూన్ 7: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన రౌడీ షీటర్ గోపు ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పచ్చునూర్‌లో భూ వివాదంలో రమేశ్, ప్రశాంత్‌రెడ్డి ఇద్దరు రౌడీషీటర్ల మధ్య గొడవలు ముదిరి మే 28న హత్యకు తీశాయని తెలిపారు. హత్య జరిగిన అనంతరం 11 మంది పరారు కాగా ఇందులో ప్రధాన నిందితుడితో పాటు మరో 8మందిని ఈ నెల 4న పోలీసులు అరెస్టు చేశారు. కాగా. మరో ఇద్దరు గాజు శంకర్, మద్దెల వెంకటేశ్‌లు తప్పించుకోగా శుక్రవారం మండల కేంద్రంలో వారిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రూ. 1.40 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న చట్ల ఆంజనేయులు అనే కానిస్టేబుల్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కాడు. తన ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారని బాధితుడు ఆంజనేయులు గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. సైబర్ నేరగాళ్లు గత నెల 30న ఆంజనేయులు సెల్‌కు కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్టు చేసినంతలో ఆంజనేయులు సెల్‌కు ఓటీపీ వచ్చింది. కొంత సేపటికి ఆంజనేయులు సెల్ బ్లాక్ అయింది. కొత్త సిమ్ తీసుకునేంతలోపు ఆంజనేయులు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారు. తన సిమ్ ఆక్టివేట్ అవగానే ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు ఆంజనేయులుకు మెస్సేజ్‌లు వచ్చాయి. ఖాతాలో ఉన్న రూ.1.93లక్షల నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 1.40లక్షలుడ్రా చేశారని గుర్తించాడు. దీంతో కానిస్టేబుల్ తన ఖాతాను బ్లాక్ చేపించాడు. గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్7: కుటుంబ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏడు సంవత్సరాల బాలికపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టిన నేరంలో నిందితుడు కారుపాక రాజ్‌కుమార్(20)కు 20 ఏళ్ల జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన వివాహితకు భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బతుకుదెరువు కోసం భర్త పిల్లలతో కలిసి వచ్చి హుజూరాబాద్‌లోని గ్యాస్ గోదాం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కొన్నాళ్లకు భర్త అనారోగ్యంతో చనిపోగా ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నది. వీణవంక మండలం పోతిరెడ్డి పేటకు చెందిన కారుపాక రాజ్‌కుమార్ తల్లితో కలిసి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. వివాహిత కుటుంబంతో రాజ్‌కుమార్‌కు పరిచయం ఉన్నది. దీన్ని ఆసరా చేసుకున్న రాజ్‌కుమార్ ఆమె పెద్దమ్మాయికి మాయమాటలు చెప్పి 2020 ఆగస్టు 8న మధ్యాహ్నం తన ఇంటికి తీసుకువెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. మరుసటి రెండు రోజులు కూడా అత్యాచారం చేసి ఎవరికీ చెప్పొద్దని బెదించాడు. రెండు రోజుల తరువాత బాలికకు తల్లి స్నానం చేయిస్తుండగా అమ్మాయి పరిస్థితి చూసి ఏమి జరిగిందని ఆరా తీయగా విషయం మొత్తం తల్లికి వివరించింది. బాలిక తల్లి హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటికి సీఐ మాధవి రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. మరో సీఐ ఎస్ శ్రీనివాస్‌రావు ఈ కేసు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాజిక్యూటర్ జూలూరి రాములు విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నిందితుడు రాజ్‌కుమార్‌కు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అంజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.1.09 కోట్లు


హుండీ సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జూన్ 7: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.1,09,62,169 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. 34 రోజులకు ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 44గ్రాముల మిశ్రమ బంగారం, 3.800కిలోల మిశ్రమ వెండి, 41విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వరంగల్ డీసీ సంజీవరెడ్డి, ఏఈవో వై. అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

పాఠశాలల్లో తుదిదశ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 7 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తుదిదశలో ఉన్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, పురోగతిపై ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగునీటి వసతి కల్పించాలన్నారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

ఇల్లంతకుంట, జూన్ 7: ఇల్లంతకుంట మండలంలో రెండు రోజులపాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిషన్ భగీరథ ప్రధాన పంప్‌హౌస్ మహ్మదాపూర్‌లో శని, ఆదివారాల్లో మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు.

గోవిందరాజులస్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

చందుర్తి, జూన్ 7 : చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజుల స్వామిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు, ప్రభుత్వ విప్‌కు ఘనస్వాగతం పలికారు. రామరావుపల్లి గ్రామంలో బీరప్ప పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు ఆది కార్తీక్, చింతపంటి రామస్వామి, మ్యాకల గణేష్, భీమరాజు కనకరాజు, ముస్కు ముకుంద రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వానలు కురవాలని రైతుల ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు విరివిగా పండాలని ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ శివారులోని సత్తే పీరీల దర్గాలో అదే గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో దర్గా వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలు, పాడి పంటలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఏటా దర్గాలో సదర్ కందూరు వేడుకలను నిర్వహిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, చంద్రారెడ్డి, రాము, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న జడ్పీటీసీ నాగం కుమార్

చందుర్తి, జూన్ 7 : ఉన్న ఊరుపై మమకారంతో గ్రామానికి ఎన్‌ఆర్‌ఐలు అందిస్తున్న సేవలు అభినందనీయమని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం మల్యాలకు చెందిన దుబాయ్ ఎన్ఆర్ఐల గ్రూప్ ఆధ్వర్యంలో గ్రామానికి బాడి ఫ్రీజర్ అందజేశారు. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. వీటితోపాటు నిరుపేద బాధిత కుటుంబాలకు శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, వైస్ ఎంపీపీ అబ్రహం, గ్రామ యువకులు పోంచేటి వెంకటేష్, మధు, బాబు, లచ్చయ్య, శ్రీనివాస్, సుధాకర్, నరేష్ పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

వేములవాడ టౌన్, జూన్ 7: నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అనుపురంలో ఏర్పాటు చేసిన సింగిల్ విండో గోదాం ప్రహరీని కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ మ్యాకల రవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. వేములవాడ మండలం అనుపురంలో కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సింగిల్ విండో భవనానికి కేటాయించినట్లు గ్రామ పంచాయతీలో చేసి ప్రహరీ నిర్మించారు. సంఘం స్థలం వెనుకవైపు ఉన్న ఓ వ్యక్తి తన ఇంటికి అడ్డుగా ప్రహరీ నిర్మించారని కూల్చివేశాడు. అనుపురం మాజీ సర్పంచ్ కొండపల్లి వెంకటరమణరావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ శీలం రాంచంద్రారెడ్డి, గ్రామస్థులు ఎర్రం ముత్తయ్య, చిట్ల శ్రీనివాస్, ఎర్రం రాములు తదితరులు ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్‌పై ఆరోపణలు చేస్తూ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు పెట్టిన మండల కేంద్రానికి చెందిన నేవూరి దేవేందర్‌రెడ్డిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండల కేంద్రానికి చెందిన దేవేందర్‌రెడ్డి 'మన ఊరు వార్తలు' వాట్సాప్ గ్రూప్‌లో ఎస్సై ఆరోపణలు చేశాడు. అసత్యప ప్రచారం చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 7: వరంగల్‌లో నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో ఎంఎస్పీ, ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపూర్ లక్ష్మణ్ మాట్లాడారు. శనివారం నుంచి జూలై 6 వరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జెండా గద్దెల నిర్మాణం చేపట్టాలని, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. జూలై 7న వరంగల్ జిల్లాలో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతుకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్లు పసుల బేష్‌కుమార్, నేరెళ్ల శ్రీనివాస్, ఎంఎస్పీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవునూరి ప్రభాకర్, గుండా థామస్, గుండేటి రాజు, మంగళి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుధ్య లోపం



తాగునీటి ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన నాచు

- ప్రత్యేక పాలనలో గ్రామీణుల అవస్థలు
- రోడ్లపైకి మురికి నీరు - జ్వరాల బారిన జనం
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: ప్రజాప్రతినిధుల పదవి కాలం ముగిసింది. పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఎల్లారెడ్డిపేట మండలంలోని పల్లెలపై అధికార యంత్రాంగం శీతకన్ను వేస్తోంది. కనీస సౌకర్యాలకు దూరంగా గ్రామాలు తల్లడిల్లుతున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. పల్లెల్లో ప్రత్యేక 'పాలన' పడకేసింది. సమస్యలు తాండవిస్తున్నాయి. మురుగు నీటి కాల్వలు కంపు కొడుతున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలతో కలుషిత నీరే దిక్కవుతోంది. ఆయా శాఖల అధికారుల సమన్వయ లోపంతో సామాన్యులకు ఇబ్బందిగా మారింది.

పేరుకుపోయిన మురుగు నీటి కాల్వలు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, పదిర, రాగట్లపల్లి, దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, తిమ్మాపూర్, గుండారం, కోరుట్లపేట, బండలింగంపల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లో మురుగు నీటి కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. మురుగును తొలగించకపోవడంతో కంపు కొడుతున్నాయి. పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ ధ్వంసమవవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. పాదచారులు, కాలనీవాసులు మురుగు నీటిలో నుంచే నడవాల్సిన దుస్థితి. దోమలు, ఈగలు వృద్ధి చెంది జనం జ్వరాల బారిన పడుతున్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. అపరిశుభ్రంతో అవస్థలు పడుతున్నారు.

కలుషిత నీరే దిక్కు



ధ్వంసమైన మురుగునీటి కాల్వ

మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపు లైన్ల లీకేజీతో నీరంతా వృధాగా పోతోంది. మురుగు నీటి కాల్వల నుంచి ఇళ్లలోకి తాగు నీటి పైపు లైన్లు వేయడంతో నీరు కలుషితమవుతోంది. శుద్ధ జలం అంద కుండాపోతోంది. ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతోంది. ఆయా గ్రామా ల్లోని తాగు నీటి ట్యాంకు చుట్టూ నాచు పేరుకు పోయి అపరిశుభ్రం నెలకొంది. మురుగులోనే నిలబడి ప్రజలు నీరును పట్టుకోవాల్సి వస్తోంది. సీసీ రోడ్లు నిర్మించి మురుగు నీటి కాల్వల పనులు చేపట్టకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ఎదుట నిల్వ ఉంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోవాలని, పల్లెల ప్రగతికి నిధులు కేటాయించడంతోపాటు ప్రత్యేక పాలనను మెరుగు పర్చాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

చెత్తను తొలగించడం లేదు



- శంకరయ్యగారి దేవరెడ్డి, ఎల్లారెడ్డిపేట

మా వార్డులోని మురుగు నీటి కాల్వల్లో చెత్తాచెదారం తీసి రోడ్డుపై వేశారు. నాలుగు రోజులైనా తొలగించడం లేదు. గాలికి చెత్తాచెదారం ఇళ్లలోకి కొట్టుకు వస్తోంది. మురుగు నీటి కాల్వ ధ్వంసమై కంపు కొడుతోంది. సీసీ రోడ్డు నిర్మించి కాల్వ పనులను వదిలేశారు. సార్లు పట్టించుకోవాలి. కాలనీలో సమస్యలను పరిష్కరించాలి.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం



- సత్తయ్య, ఎంపీడీవో- ఎల్లారెడ్డిపేట

ఎన్నికల విధులతో గ్రామాల్లోని సమస్యల పరిష్కారంలో కొంత జాప్యం జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు చేపడుతాం. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే విధుల బహిష్కరణ



ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 7 : గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వారం రోజుల్లో చెల్లించాలని, లేని పక్షంలో కార్మికులు విధులను బహిష్కరిస్తారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ ప్రకటించారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సీఐటీయూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కలెక్టర్ స్పందించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేతనాలను వారం రోజుల్లో చెల్లించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, అన్నల్‌దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, అంజయ్య, మహేష్, నర్సయ్య, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మణ్, గంగరాజు, సకులవ్వ, భిక్షపతి, అనిల్, శేఖర్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి చేయాలి



మంత్రికి సమస్య విన్నవిస్తున్న నాయకులు

వీర్నపల్లి, జూన్ 7 : పోడు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పార్టీ వీర్నపల్లి మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, నాయకులు శివరామకృష్ణ, సంతోష్, అంజయ్య, రాజు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

ఇల్లంతకుంట, జూన్ 7: క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శుక్రవారం వీకేఆర్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి జన్మదినం సందర్భంగా పోటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు అంతగిరి బాలపోచయ్య, కరివెద కర్ణాకర్‌రెడ్డి, ఎర్రోజు సంతోష్, మామిడి రాజు, తూముకుంట రాజేందర్‌రెడ్డి, మంద బాల్‌రెడ్డి, లింగం, సురేందర్ రెడ్డి, ఉస్మాన్, జమాల్, ప్రసాద్, రాకేష్, బెజ్జంకి శ్రీనివాస్, వీరేషం, రమేష్, సాయివర్మ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట జూన్ 7:కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ముంద్రాయి సందీప్ అనే రైతు మృతి చెందగా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రైతు భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

● బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు రైతు సందీప్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.బీఆర్‌ఎస్ నాయకులు రాఘవరెడ్డి, మల్యాల దేవయ్య, వంశీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

● రైతు సందీప్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాజీ సర్పంచులు వంశీకృష్ణ రావు, జవ్వాజి తిరుపతి గౌడ్, మల్లేశం, ప్రజాప్రతినిధులు మహేష్, అనిల్, విజయ్ ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మెట్‌పల్లి రూరల్, జూన్7: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి తహసీల్దార్ శేఖర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆర్ఐ ఉమేశ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మండలంలోని గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందితో నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

వేములవాడ టౌన్, జూన్ 7: వేములవాడ పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి తండ్రి ఇటీవల మృతి చెందగా చల్మెడ లక్ష్మీనర్సింహారావు శుక్రవారం పరామర్శించారు. కౌన్సిలర్ జోగిని శంకర్, నరాల శేఖర్, గోలి మహేష్ నాయకులు వాసాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నాయకులను సన్మానిస్తున్న కార్మికులు

కోనరావుపేట, జూన్ 7 : బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధి రాములు అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌లోని శివానగర్ బీడీ సెంటర్‌ను పరిశీలించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీడీ కార్మికుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీడీ కార్మికులు సంఘాల నాయకులను సన్మానించారు. సంఘం నాయకులు ముద్రగోల ఆంజనేయులు, జగదీష్, మల్లేశం, తిరుపతి, రాజు, లక్ష్మీనారాయణ, రాధా, గంగాధర్, అనిల్ తదితరులు ఉన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం

- గద్దె గట్టు చెరువుకు బుంగ
- ఏడాదిగా మరమ్మతుకు నోచుకోని వైనం
- మరమ్మతుకు రూ.48 లక్షలు మంజూరు
- ప్రారంభంకాని పనులు



గద్దె గట్టు చెరువు మత్తడి వద్ద పడిన బుంగ

కోనరావుపేట, జూన్ 7: గద్దె గట్టు చెరువుకు గత సంవత్సరం బుంగ పడింది. చెరువు మత్తడి డిస్ట్రిబ్యూటర్ దెబ్బతిన్నది. దీని మరమ్మతు కోసం రూ.48.50 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ శివారులోని గద్దెగట్టు చెరువు సుమారు 100 ఎకరాల్లో వ్యాపించి ఉంది. వెంకట్రావుపేట, నిజామాబాద్ సుమారు 300 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుంది. ఈ రెండు గ్రామాలకు ఈ చెరువు పూర్తి స్థాయిలో నిండితే సాగునీరుకే కాక భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. కానీ ఐదు సంవత్సరాల క్రితమే మత్తడి డిస్ట్రిబ్యూటర్ మరమ్మతుకు చేరుకుంది. గతేడాది భారీ వర్షాలకు మత్తడి వద్ద బుంగపడి నీరంతా మూల వాగులో కలిసి పోయింది. దీంతో రెండు గ్రామాల ప్రజలు ట్రాక్టర్ల ద్వారా మట్టి సంచులు నింపి తాత్కాలిక మరమ్మతు చేపట్టినా నీరు ఆగడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేయాలని రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. మరమ్మతుల కోసం రూ.48.50 లక్షలు మంజూరయ్యాయి. పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ఈ ఏడాది వర్షాలు కురిస్తే నీరు బయటకు వెళ్లిపోతుందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు నడపాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 7: విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు తెలత్తకుండా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్‌కు బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి విద్యార్థులు జిల్లా కేంద్రానికి వస్తుంటారని, ఉదయం, సాయంత్రం సమయానుకూలంగా బస్సులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు ఒగ్గు అరవింద్, నవీన్, తిరుపతి, వంశీ, సాయి, భాను, అరవింద్, సాయి, శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న బడి బాట



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



ఆవునూర్‌లో..



కనగర్తిలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, వెంకటాపూర్, సింగారం, బొప్పాపూర్, గుండారం, నారాయణపూర్, తిమ్మాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

ముస్తాబాద్: బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ముస్తాబాద్ మండల నోడల్ అధికారి రాజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, ఆవునూర్, రామలక్ష్మణపల్లె, గూడెం, పోతుగల్ తదితర గ్రామాల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. ఉచిత విద్య ఉచితంగా పుస్తకాలు, యునిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మద్దికుంట లక్ష్మణ్, సురేశ్, పర్శరాం, ఫాతిమా, శ్రీలత, విజయలక్ష్మీ, రాజేందర్, పద్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్, గొల్లపల్లి, రేపాక గ్రామాలలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

కోనరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు వినోద్ కుమార్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తిలో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అధిక మార్కులు సాధిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, హెచ్‌ఎం దేవదాసు తదితరులు ఉన్నారు.

ఎంఈవో బన్నాజీకి బాధ్యతలు

వేములవాడ టౌన్, జూన్ 7:వేములవాడ ఎంఈవోగా, జడ్పీ హెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్ హెడ్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన భూక్యా బన్నాజీని మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. ఎంఈవో పదవిలో ఉండి ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందున బాధ్యతల నుంచి తప్పించారు. వరంగల్ స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యువకుడి రక్తదానం

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు రాఘవేంద్ర శుక్రవారం రక్తదానం చేశాడు. మండల కేంద్రానికి చెందిన నాంపల్లి అనారోగ్యంతో బాధ పడుతూ సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. అతడికి ఏబీ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాఘవేంద్ర రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా రాఘవేంద్రను పలువురు అభినందించారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ఇల్లంతకుంట, జూన్ 7: మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా మండలకేంద్రంలోని మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.